క్లుప్తంగా

ఉచిత శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ పరీక్ష కోసం శుక్రవారం నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టుప్రిన్సిపాల్ ఎ.జగదీశ్వరరావు గురువారం తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఉచితంగా శిక్షణను ఇవ్వనున్నట్లు చెప్పారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిసెట్ ప్రవేశాలకు ఉపయోగకరంగా ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. కురుపాం మండలంలోని సంతోషపురం, రజ్జిలి, పాడి గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన సైబర్ నేరాలు, రహదారి భద్రత, మత్తుపదార్థాలు వలన కలిగే అనర్థాల గూర్చి అవగాహన కల్పించారు. నాయన వెంట ట్రైనీ ఎస్ఐలు ఉన్నారు.

ఇంటర్వ్యూకు 90 మంది హాజరు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం కురుపాం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా మండలానికి 19 యూనిట్లు మంజూరు కాగా అందుకోసం మండల పరిధిలో నుంచి 125 దరఖాస్తులు అందగా ఇంటర్వ్యూకు 90 మంది హాజరయ్యారని ఎంపీడీఓ తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత తదితరులు పాల్గొన్నారు.

37 మంది గైర్హాజరు

సీతంపేట: మండలానికి బీసీ కార్పొరేషన్ యూనిట్లను కేవలం నాలుగే ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి మండలంలో పదుల సంఖ్యలో యూనిట్లు మంజూరైతే సీతంపేట మండలానికి మాత్రం కేవలం నాలుగే కేటాయించారు. అయితే మండల వ్యాప్తంగా 186 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించగా, 36 మంది గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడంగి కృష్ణారావు, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాల పనితీరుపై అవగాహన

భామిని: డ్రోన్ కెమెరాల పనితీరుపై బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్ సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. మనుమకొండ - పాలవలస గ్రామాల రోడ్లలో డ్రోన్ కెమెరా ఏగురవేసి వాటిని ఎలా పర్యవేక్షించాలో సిబ్బంది వివరించారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు విషయంలో డ్రోన్ కెమెరాల సహకారం మరువలేమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్లు, ఫీడర్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. పట్టణంలోని ఎన్‌కే రాజపురం, సీఎల్ నాయుడు నగర్, సీతంపేట రోడ్డు, నీలమ్మకాలనీ, మురళీమోహన్ నగర్, ఏరియా ఆస్పత్రి రోడ్డు, యాతవీధి, కళామందిర్ వీధితో పాటు వేమకోటి వారి వీధి, శ్రీకాకుళం రోడ్డులో సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో లుంబూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. గాసీవీధి, కస్పావీధి, దేవరపేట, బోనం వీధి, రెల్లివీధి, వీవర్స్ కాలనీ, పెద, చిన్న కాపు వీధులు, వెంకమ్మపేట, నెయ్యల వీధి, సెగిడి వీధి, లుంబూరువారి వీధుల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: అనుకోని సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు కేసులు ఛేదించడంలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని ఏఎస్సై ధర్మారావు అన్నారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు పట్టణ, మండల పరిధిలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, పలు ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు జాతీయ నాయకుల విగ్రహ నిర్వాహకులకు గురువారం అవగాహన కల్పించారు. అనంతరం విశాఖ, సీతంపేట రహదారుల్లో వాహన చోదకులకు డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు చేపట్టారు.

నిరసన..



ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు గురువారం నిరసన చేపట్టారు. ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ నాయకుడు వి. రాజేష్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అన్ని కేటగిరీల్లో ఉద్యోగోన్నతులు కల్పించాలని, గ్యారేజ్‌లకు స్పేర్ పార్ట్స్ అందించాలని, అన్ని రకాల సిక్ లీవ్‌లపై పూర్తిస్థాయి జీతం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం. వైకుంఠరావు, ఎస్టీరావు, యు. లక్ష్మి, ఎస్. అంజలి, ఎంఎస్ చలం, పి. మణి, తదితరులు పాల్గొన్నారు. - పాలకొండ

నిర్లక్ష్యం తగదు ...

మూడేళ్ల కిందట చేపట్టిన వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా జంక్షన్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆర్అండ్‌బీ అధికారులు తొలగించారు. అయితే పనులు పూర్తయి పది నెలలు కావొస్తున్నా ఇంతవరకు ఈ విగ్రహాన్ని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేయలేదు. వెంటనే అధికారులు స్పందించి విగ్రహాన్ని పాత స్థానంలో ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ నాయకులు ఎస్.సింహాచలం, కె. సింహాచలం, ప్రసాదరావు, తదితరులు కోరారు. - వీరఘట్టం



కోదండరామ స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా కోదండ రామాలయంలో గురువారం ఉదయం శ్రీరామ సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, రుత్విక్ వరుణ తదితర పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ, లక్ష్మీమంత్ర జపములు, శ్రీమద్రామాయణ పారాయణములు నిర్వహించారు. అనంతరం శ్రీకోదండరామస్వామిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 6న ఉదయం 9 గంటలకు శ్రీసీతారామస్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. -గరుగుబిల్లి



ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు



ఏరియా ఆస్పత్రి

పాలకొండ రూరల్: ఏజెన్సీ కలబోసి ఉన్న నియోజకవర్గ కేంద్రమైన పాలకొండలో వైద్యసేవలు నూతన ఒరవడి దిద్దుకుంటున్నాయి. తాజాగా స్థానిక ఏరియా ఆస్పత్రికి ఆయుష్మాన్ భారత్ ద్వారా నేషనల్ స్కీమ్ వర్తించడంతో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) మంజూరైంది. దీంతో మరింత మెరుగైన, ఆర్థిక భారంతో కూడిన వైద్య సేవలు ఈ ప్రాంత వాసులకు ఉచితంగా చేరువకానున్నాయి. గతంలో 14 మండలాలకు పెద్దదిక్కుగా ఉన్న స్థానిక ఏరియా ఆస్పత్రిలో రిఫర్ కేసులు అధికంగా ఉండేవి. అప్పట్లో పూర్తి స్థాయి సిబ్బంది, పూర్తిస్థాయి వైద్యులు, సాంకేతికత, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో లేకపోవడం ఒక కారణమైతే.. నాటి పాలకుల ధోరణితో అత్యవసర సేవలు అందని ద్రాక్షగా మారాయి. పదేళ్ల కిందట ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరైనా.. పనుల్లో ఎడతెగని జాప్యంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. 2020 - 21 మధ్య కాలంలో పంజా విసిరిన కోవిడ్ సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చూపించిన చొరవతో వైద్య సేవలు విస్తృతమయ్యాయి. అప్పట్లో ప్రత్యేక ఆక్సిజన్ యూనిట్‌తో పాటు వార్డులు ఆధునీకరించారు. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఆస్పత్రి వైఎస్సార్‌సీపీ హయాంలో సరికొత్త రూపం సంతరించుకుంది. రూ.3 కోట్లతో అధునాతన వైద్య పరికరాలతో పాటు సెంట్రల్ ఆక్సిజన్ ప్లాంట్, పది పడకల ఐసీయూ, ఆస్పత్రి డిజిటలైజేషన్‌కు 20 కంప్యూటర్లతో కూడిన ప్రత్యేక పర్యవేక్షణ విభాగం రూపుదిద్దుకుంది. 300 ఎంఏ ఎక్స్‌రే యంత్రం, బ్లడ్ బ్యాంక్, పూర్తి స్థాయి వైద్యులు, ఇతర విభాగాలకు చెందిన సిబ్బంది అందుబాటులోకి వచ్చారు. దీనికి తోడు ఏజెన్సీ సీతంపేటలో రూ.49 కోట్లతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.

నేడు నేషనల్ స్కీమ్ ద్వారా..

ఏజెన్సీ మిళితమై ఉన్న ఈ ప్రాంత వాసులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ద్వారా క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) మంజూరు చేసింది. ఈ సేవలు స్థానిక ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చేందుకు రూ.23.75 కోట్ల నిధులు కూడా కేటాయించింది. ఈ నిధులతో జీ ప్లస్-2 (మూడంతస్తుల) భవన నిర్మాణం చేపట్టనున్నారు. ఈ భవనంలో నూతనంగా ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ), ప్రసూతి విభాగానికి సంబంధించిన ఐసోలేషన్ వార్డు, అధునాతన, సాంకేతిక విలువలతో కూడిన ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు వైద్య సంబంధిత పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్, ఎక్స్‌రే విభాగం, ఆల్ట్రా స్కాన్, భవిష్యత్‌లో సీటీ స్కాన్ విభాగం కూడా అందుబాటులోకి రానుంది. దాదాపు ఐదు వందల మేర ఓపీ ఉండే ఈ ఆస్పత్రిలో సీసీబీ యూనిట్ నిర్మాణాలకు సాంకేతిక, ఇంజినీరింగ్ అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. నిరుపయోగంగా, అవసాన దశలో ఉన్న సిబ్బంది క్వార్టర్స్, ఆర్ఎంఓ భవనం తొలగించి క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి కసరత్తు చేపట్టారు. ఈ ప్రక్రియ టెండర్ దశలో ఉందని, మరో వారం రోజుల్లో పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు ఏపీఎస్ఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.సత్యప్రభాకర్ తెలిపారు.

మరింత అధునాతన సేవలు..



క్రిటికల్ కేర్ బ్లాక్ అతి త్వరలో అందుబాటులోకి రానుంది. తద్వారా మరింత అధునాతన వైద్య సేవలు పొందవచ్చు. 24/7 నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారు. ప్రాణాపాయ స్థితిలో వచ్చే బాధితులకు అత్యవసర సేవలు అందించవచ్చు. ఇందుకు సంబంధించి నిపుణులైన వైద్యులు, దాదాపు 15 మంది నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అదనపు సిబ్బందిని సమకూర్చనున్నాం. - **జి.నాగభూషణరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ**

6న సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ

గుమ్మలక్ష్మీపురం (కురుపాం):

కురుపాం మండలం ధర్మలక్ష్మీపురం గ్రామంలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన 27 అడుగుల షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు షిర్డీ సాయి సేవా ఆశ్రమం వ్యవస్థాపకులు అమ్ముల సాంబశివరావు, అధ్యక్షుడు ఎ.అయోధ్యరావు తెలిపారు.

ఈమేరకు గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా 6వ తేదీతో పాటు 7వ తేదీన కూడా సాయికథ గానరూపకం, సాయిసత్యవ్రతాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

సాక్షి ఎఫెక్ట్

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలో రూ.1.26 కోట్ల నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోకపోవడంతో వీరఘట్టంలో అభివృద్ధి పడకేసిందని గత నెల 31న సాక్షిలో 'వినియోగానికి నోచుకోని నిధులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీలోని 28 పనులను రూ.49.12 లక్షలతో చేపట్టేందుకు గురువారం తీర్మానం చేశారు. రెల్లివీధి నుంచి పొల్లరోడ్డు, కొత్త బస్టాండ్‌లోని కల్వర్టు, యల్లంకివీధి రోడ్డు, తదితర పనులు చేపట్టనున్నట్లు ఈఓ బి. కోటేశ్వరరావు తెలిపారు. పంచాయతీలో మూలుగుతున్న నిధుల విషయాన్ని ప్రజలకు తెలియజేసి, పంచాయతీ పాలకవర్గం స్పందించేలా చేసిన సాక్షికి మేజర్ పంచాయతీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



సాక్షి

వినియోగానికి నోచుకోని నిధులు

గత నెల 31న సాక్షిలో వచ్చిన కథనం

ఎస్‌హెచ్‌జీ రికార్డుల నిర్వహణపై శిక్షణ

భామిని: మహిళా స్వయం శక్తి సంఘాల రికార్డుల నిర్వహణ, ఆర్థిక వ్యవహారాల అంశాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసే బాధ్యత యానిమేటర్స్‌పై ఉంటుందని వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధారాణి, స్త్రీ నిధి ఏజీఎం హేమలత అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం మీసాల చక్రపాణి ఆధ్వర్యంలో వీఏఓలు, యానిమేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి పది ఎస్‌హెచ్‌జీల రికార్డులను ఒక యానిమేటర్ పర్యవేక్షించాలని సూచించారు. వెలుగు డీపీఎం ఆర్‌వీ రమణ, ఉన్నతి ఏపీఎం పార్వతి, సీసీలు, సీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెలుగు అధికారులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామంలో శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శివుడును దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ మరడాన సింహచలం నాయుడు, భక్తులు పాల్గొన్నారు.



గిజబలో శివుడుని దర్శించుకుంటున్న భక్తులు

తిరుపతిరావు కుటుంబాన్ని పరామర్శించిన పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పెదకుదమ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బొంతు తిరుపతిరావు ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. చిన్న వయసులో ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.శశికళ, మండల పార్టీ అధ్యక్షుడు కోట రమేష్ నాయుడు, పల్ల అనంతనాయుడు, కెంగువ వెంకట నాయుడు, మరడాన జగన్నాథంనాయుడు, ఎం.కిశోర్, మండంగి రవికుమార్, పల్ల సింహాచలం నాయుడు, అల్లు ఈశ్వరరావు, భీమవరపు సింహాచలం, బలగ వాసునాయుడు పాల్గొన్నారు.



తిరుపతిరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి

పరామర్శ



విద్యార్థి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం పలు కుటుంబాలను పరామర్శించారు. దోనుబాయి ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్.చలపతి అనే విద్యార్థి మృతి చెందడంతో కాగుమానుగూడ గ్రామం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. అనంతరం కె.వీరఘట్టంలో మూడురోజుల కిందట సర్పంచ్ ఎ. చెంచమ్మ భర్త చిన్నారావు మృతిచెందారు. ఈ మేరకు చెంచమ్మను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తవిటిరాజు, ఎస్.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి

భామిని: ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరని నీతిఅయోగ్ బ్యాంకింగ్ బృందం తెలిపింది. మండలంలోని మనుమకొండలో నీతి అయోగ్ ఆధ్వర్యంలో వచ్చిన మైక్రోసేవ్ సభ్యులు ఆర్థిక అక్షరాసత్యపై గురువారం అవగాహన కల్పించింది. అలాగే ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి యోజన, బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై వివరించారు. కార్యక్రమంలో మైక్రోవేవ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మీమాంశ కన్నా, సుభి, సుష్మాఖా, ఏపీ, టీఎస్ ప్రతినిధి మధుసూదనరావు, నీతి అయోగ్ ప్రతినిధి మహేష్, సర్పంచ్ నిమ్మల కేశవ, ఎంపీటీసీ సభ్యుడు పత్తిక మురళీ, తదివతరులు పాల్గొన్నారు. అనంతరం మనుమకొండ అక్షర బ్రహ్మ ఆలయాన్ని సందర్శించారు.



గిరిజనులతో మాట్లాడుతున్న మైక్రోసేవ్ సభ్యులు

ఎన్యూమరేటర్లకు శిక్షణ

సీతంపేట: వెలుగు ఆధ్వర్యంలో 1252 గ్రామైక్య సంఘాలకు సంబంధించి 215 మంది ఎన్యూమరేటర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం స్థానిక వైటీసీలో ప్రారంభించారు. గ్రామ, మండల సంఘాల నిధుల సేకరణ ఏవిధంగా చేయాలో అధికారులు వివరించారు. ఈ నెల 6వ తేదీ నుంచి సమావేశాలు ఏర్పాటు చేసుకుని వార్షిక ప్రణాళికలు తయారు చేయనున్నట్లు డీపీఎం రమణ తెలిపారు.

ఆర్గానిక్ పంటలను ప్రోత్సహించాలి

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: ఆర్గానిక్ పంటలను ప్రోత్సాహించాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. సీతంపేట, పాలకొండ, వీరఘట్టం, భామిని మండలాల అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులతో పాటు ఎన్జీఓ సంస్థలైన ఆర్ట్స్, వెలుగు ఏపీసీఎస్ఎఫ్ సంస్థల ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తి సేంద్రియ పద్ధతుల్లో జీడి సాగయ్యేలా చూడాలన్నారు. ఇందుకు సంబంధించిన సూచనలు, సలహాలు రైతులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఓ ఎస్‌వీ గణేష్, ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు, వెలుగు డైరెక్టర్ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే పర్యావరణ పరిరక్షణ

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని రీజనల్ తిమోటిక్ లీడ్ కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో గల రైతు సేవా కేంద్రంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం, అనుబంధ సంస్థలు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజంగా లభించే వనరులను వినియోగించుకొని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించేందుకు రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా పండించే పంటలకు మార్కెట్‌లో అధిక ధరలు లభించే అవకాశం ఉందన్నారు. జట్టు వ్యవస్థాపకులు, స్కూల్ సిలబస్ డవలెప్‌మెంట్ సీనియర్ కన్సల్టెంట్ డి.పారినాయుడు, రీజనల్ టెక్నికల్ అధికారి జి. హేమసుందర్‌లు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా పంటలు పండించుకోవడం వలన భూమి సారవంతంగా తయారవ్వడంతోపాటు ఆరోగ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎ.నిర్మలాదేవి, మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి, ఏపీఎం పి.అప్పలనాయుడు, రచయితలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజనల్ తిమోటిక్ లీడ్ కె.ప్రకాష్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ బొంగు సురేష్ హాజరై ప్రకృతి వ్యవసాయంపై పలు సూచనలు చేశారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు.ఎంపీడీఓ ఎస్.రమేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామసభలు ఏర్పాటు చేసి రైతుకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని అన్నారు. రైతు సాధికార సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ మన్మోహన్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ పారినాయుడు మాస్టర్ ట్రైనర్ శ్రీరాం, గ్రామ సంఘం అధ్యక్షుడు, వీఓఏలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

వీఆర్‌ఏల రాష్ట్ర సదస్సు రేపు



ఈశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విజయవాడలో ఈ నెల 5న నిర్వహించ తలపెట్టిన వీఆర్‌ఏల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు గరుగుబిల్లి ఈశ్వరరావు కోరారు. గురువారం ఆయన కురుపాంలో విలేకర్లతో మాట్లాడుతూ.. వీఆర్‌ఏల పే అఫ్ స్కేల్ పెంచాలని, వీఆర్‌ఏలకు అటెండర్, నైట్ వాచ్‌మ్యాన్, డ్రైవర్‌లుగా పదోన్నతులు కల్పించాలని, వన్‌టైం సెటిల్మెంట్‌గా నామిని వీఆర్‌ఏలను వీఆర్‌ఏలుగా గుర్తించాలన్న ప్రధాన డిమాండ్లతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సుకు జిల్లాకు చెందిన వీఆర్‌ఏలంతా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కురుపాం నియోజకవర్గంలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు సంబంధించి మండల కమిటీలను నియమిస్తూ పార్టీ అధిష్టానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

కురుపాం మండలం

కురుపాం మండల పార్టీ వైస్ ప్రెసిడెంట్‌లుగా హిమరిక నాగేశ్వరరావు, గవర విజయ్, జనరల్ సెక్రెటరీలుగా సువ్వాన చంటి, బిడ్డిక మిన్నారావు, శెట్టి సురేష్, కుంబురుకు మధు, సెక్రెటరీలుగా కిమిడి భూషణ్, ఆకుల శ్రీధర్, ఆరిక రాజయ్య, వల్లంకి సత్యనారాయణ, తిమ్మక కోటి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కొండగొర్రి కిరణ్, తిమ్మక శంకరరావు, కొండగొర్రి కేశవరావు, బిడ్డిక సుబ్బారావు, పత్తిక అప్పారావు, ఆరిక రమేష్, బిడ్డిక ఆయిబో, బిడ్డిక భాస్కరరావు, పువ్వల చంద్రయ్య, కందిస సత్యం, పెద్దింటి పాపారావు, ఆరిక చిరంజీవి, మూటక నాగేశ్వరరావు, ఆరిక పాత్రో, ఆరిక నాగేశ్వరరావు, పున్నాన రవిలను నియమించారు.

గుమ్మలక్ష్మీపురం మండలం

గుమ్మలక్ష్మీపురం మండలం వైస్ ప్రెసిడెంట్‌లుగా నిమ్మక నాగేశ్వరరావు, కొండగొర్రి రాజేష్, జనరల్ సెక్రెటరీలుగా తాడంగి పాపారావు, మండంగి శంకరరావు, పెద్దింటి జోగారావు, మండంగి జగ్గారావు, సెక్రెటరీలుగా పత్తిక బీసు, కొండగొర్రి అప్పారావు, మండంగి రామకృష్ణ, నిమ్మక సీతారాం, మీనక సతీష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మండంగి శ్రీనివాస్, తాడంగి కిషోర్, కిల్లక పైడిరాజు, బిడ్డిక రంగోజీ, ఎప్పరిక గణపతి, పాలక జగదీష్, ఆరిక జోగులు, లాభాల సంతోష్, బిడ్డిక అగ్గన్న, కలప ప్రదీప్, సీమల శంకరరావు, పువ్వల మోహన్, బిడ్డిక శంకరరావు, సీమల సురేస్, కత్తిక భువనేశ్వర్, కొండగొర్రి లచ్చన్న, ఆరిక రవికుమార్‌లను నియమించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వీరఘట్టం: మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.వెంకటరమణ గురువారం తెలిపారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశానికి వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): నెలలు నిండి ఆసుపత్రికి వచ్చే గర్భిణులలో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు కురుపాం సీహెచ్‌సీ సూపర్‌వైజర్ డాక్టర్ శోభారాణి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆమె సీహెచ్‌సీలో చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాల గూర్చి అవగాహన కల్పించారు. తమ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలే అధికంగా జరుగుతున్నాయని, తమ సిబ్బంది కూడా సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. నొప్పులు భరించలేక కొందరు, ముహూర్తాల కోసం మరికొందరు ఆపరేషన్లు చేయించుకునేందుకు ఆశక్తి చూపుతున్నారని, అటువంటివి సరికాదన్నారు. ఆసుపత్రుల వద్ద గర్భిణిలకు ఉచితంగా పోషకాహార కిట్లు కూడా అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

